

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్
వరంగల్ కలెక్టర్ సత్యశారద చేసిన హెచ్చరికలను అధికారులు, కూరగాయల మార్కెట్ వ్యాపారులు బేఖాతర్ చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- 8లో▸



శబరిమలకు ప్రత్యేక బస్సులు
అయ్యప్ప స్వామి భక్తుల సౌకర్యార్థ శబరిమలకు ప్రత్యేక ఏసీ, నాన్ ఏసీ బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు వరంగల్ రీజినల్ మేనేజర్ విజయభాను తెలిపారు.
- 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
32.6^0 / 21.5^0

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఎండ ఉంటుంది. రాత్రి సమయంలో పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



ములుగు రూరల్: మండల పరిధిలోని జంగాలపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థినులు అండర్ -17 విభాగంలో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, మండల విద్యాశాఖ అధికారి సామల శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు గురువారం పాఠశాలలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు రిషిక, గుగులోత్ శివానిలను అభినందించి మాట్లాడారు. ఈ విద్యార్థినులు నేటి నుంచి 10వ తేదీ వరకు ఖమ్మం జిల్లా కల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థినులను అభినందించిన వారిలో వ్యాయామ ఉపాధ్యాయుడు గుండబోయిన మల్లయ్య, ఉపాధ్యాయులు రవీందర్, రమేష్, వీరభద్రయ్య, కృష్ణమూర్తి, అరుణకుమారి, పద్మలు ఉన్నారు.

జేసీబీ సీజ్



వెంకటాపురం(కె): మండల పరిధిలోని అంకన్నగూడెం గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేస్తున్న జేసీబీని గురువారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. తహసీల్దార్ లక్ష్మిరాజయ్య కథనం ప్రకారం.. అంకన్నగూడెం గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలో జేసీబీతో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేస్తున్నారనే సమాచారం మేరకు సిబ్బంది వెళ్లి దాడులు నిర్వహించాము. ఈ సందర్భంగా జేసీబీని సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. అదే విధంగా వాల్టా చట్టం కింద కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ దాడుల్లో ఆర్ఐ మల్లయ్య, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపనకు నిర్ణయం



ఏటూరునాగారం: మండల కేంద్రంలోని వైజంక్షన్ వద్ద 35 ఫీట్ల ఎత్తులో అభయాంజనేస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు గ్రామస్తులంతా నిర్ణయం తీసుకున్నారని విగ్రహ దాత, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహరావు అన్నారు. మండల కేంద్రంలోని లక్ష్మీనర్సింహరావు ఇంటి వద్ద పార్టీలకు అతీతంగా గ్రామస్తులు గురువారం సమావేశం అయ్యారు. 163 జాతీయ రహదారిపై జరుగుతున్న ప్రమాదాలు, ఏటూరునాగారం మండలం, గ్రామం సుభిక్షంగా ఉండేందుకు హనుమాన్ జంక్షన్‌లో హనుమాన్ విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు ముహూర్తం ఖరారు చేసినట్లు ఆయన తెలిపారు. ఈనెల 14వ తేదీన చేపట్టిన భూమి పూజకు అందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రఘు, సునీల్, మల్లారెడ్డి, శ్రీనివాస్, రామ్మూర్తి, సత్యం, లాలయ్య, లక్ష్మీనారాయణ, ప్రభాకర్, రాజు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతరలో పనుల పరిశీలన
రేగొండ: మండలంలోని తిరుమలగిరి శివారులోని బుగులలోని జాతర పనులను గురువారం డీపీఓ నారాయణరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నిర్మల పరిశీలించారు. ఈ నెల 14నుంచి 18వరకు జరిగే జాతరలో భక్తులకు అసౌకర్యాలు కలగకుండా పనులను సకాలంలో పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. రహదారి వెంబడి పిచ్చి మొక్కలను తొలగించి, జాతర ప్రాంగణంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని పేర్కొన్నారు. జాతరకు వచ్చే భక్తులకు నీటివసతి కల్పించాలని అధికారులకు సూచించారు.

'ప్రారంభించిన పనులకే శంకుస్థాపనలు'
భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన అభివృద్ధి పనులకు ప్రస్తుత ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు శంకుస్థాపనలు చేయడం ఏమిటని మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి ఆరోపించారు. జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో టీయూఎఫ్ఐడీసీ నిధుల ద్వారా రూ.90కోట్లు మంజూరు చేసి శంకుస్థాపనలు చేశామన్నారు. ఈ సమావేశంలో జనార్దన్, రాజు, హరిబాబు పాల్గొన్నారు.

శివగంగ పాలేనా?

నిరుపయోగంగా మారిన ఎత్తిపోతల పథకం

- 16 ఏళ్లు గడుస్తున్నా ఫలితం శూన్యం
- వినియోగంలోకి తీసుకొస్తే వేలాది ఎకరాలకు సాగునీరు

మంగపేట: జిల్లా సరిహద్దు గ్రామమైన బ్రాహ్మణపల్లి వద్ద నిర్మించిన శివగంగ ఎత్తిపోతల పథకం పనులకు వెచ్చించిన కోట్లాది రూపాయల నిధులు గంగపాలేనా అని ఆయకట్టు రైతులు ప్రశ్నిస్తున్నారు. బ్రాహ్మణపల్లికి సుమారు 3 కిలోమీటర్ల దూరంలోని కత్తిగూడెం గ్రామ సమీపంలో గల గోదావరి ఒడ్డున లిఫ్ట్ ఇరిగేషన్‌ను బ్రాహ్మణపల్లి, కత్తిగూడెం రెవెన్యూ పరిధిలోని 1600 ఎకరాల ఆయకట్టు భూములకు సాగునీటి సౌకర్యం కల్పించేందుకు 2008లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని అధికార కాంగ్రెస్ ప్రభుత్వం రూ.8.52 కోట్లు మంజూరు చేసింది. ఎత్తిపోతల పథకం పనులను అప్పటి భారీనీటి పారుదలశాఖ మంత్రి పొన్నాల లక్ష్మయ్య 2008 నవంబర్ 25న ప్రారంభించారు.

ఆయకట్టు రైతుల్లో అసంతృప్తి

ఎత్తిపోతల పథకం పూర్తయితే తమ సాగు భూములకు రెండు పంటలకు సాగునీరు అందుతుందనుకున్న బ్రాహ్మణపల్లి, కత్తిగూడెం గ్రామాల ఆయకట్టు రైతుల ఆశ కలగానే మిగిలిపోతుందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించి 16 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు వినియోగంలోకి రాకపోవడంపై ఆయకట్టు రైతుల్లో అసంతృప్తి నెలకొంది. ఎత్తిపోతల పథకం వినియోగంలోకి తీసుకువస్తే బ్రాహ్మణపల్లి, పెరకకుంట, కిందిగుంపు, కత్తిగూడెం గ్రామాల రైతులకు చెందిన 1600 ఎకరాల ఆయకట్టు భూములతో పాటు అనధికారికంగా పొరుగున ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం దుగినేపల్లి, రెడ్డిగూడెం గ్రామాలకు చెందిన గిరిజన, గిరిజనేతర రైతులకు చెందిన వేలాది ఎకరాల సాగు భూములకు రెండు పంటలకు పుష్కలంగా సాగునీరు అందే అవకాశాలు ఉన్నాయి. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారిస్తే తప్ప ఎత్తిపోతల పథకం వినియోగంలోకి వచ్చే అవకాశాలు లేవని ఆయకట్టు రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



నిరుపయోగంగా మారిన శివగంగ ఎత్తిపోతల పథకం

పనులు పూర్తయినా.. అందని సాగునీరు
ఎత్తిపోతల పథకం పనులపై సంబంధిత ఏపీఎస్ఐడీసీ అధికారుల పర్యవేక్షణ క్షేత్రస్థాయిలో లేకపోవడం, టెండర్ ద్వారా పనులు పొందిన గుత్తేదారు నాసిరకంగా పనులు చేపట్టి చేతులు దులుపుకున్నాడు. దీంతో 16 ఏళ్లు గడుస్తున్నా నేటి వరకు ప్రాజెక్టుతో లాభం లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత టీఎస్ఐడీసీ అధికారులు మాత్రం పనులు మొత్తం పూర్తయ్యాయని నీటిని లిఫ్టింగ్ చేసేందుకు గోదావరిలో వరద నీరు ఒడ్డువెంట కాకుండా మధ్య నుంచి ప్రవహించడం కారణంగా ఎత్తిపోతల పథకం నిరుపయోగంగా మారిందని చెబుతున్నారు.



అప్పటి భారీ నీటిపారుదల శాఖ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ప్రారంభించిన శిలాఫలకం

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా..
ఎత్తిపోతల పథకం పనులు మొత్తం పూర్తయ్యాయి. ప్రారంభించే క్రమంలో గోదావరిలో నీరు ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసిన ప్రాంతం వైపు పెద్ద ఎత్తున ఇసుక మేటలు వేసింది. దీంతో నీరు ఇటువైపు ప్రవహించకుండా గోదావరిలో కిలోమీటరు దూరంలో మధ్య నుంచి ప్రవహించడంతో ఎత్తిపోతల పథకం నిరుపయోగంగా మారింది. ఇటీవల ఎస్ఈతో కలిసి పరిశీలించాం. మరోసారి పరిశీలించి ఏ విధంగా వినియోగంలోకి తీసురావాలనే విషయాన్ని పరిశీలించి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా.

- రాజయ్య, టీఎస్ ఐడీసీ డీఈఈ

జిల్లాలో 96.24శాతం స్టిక్కరింగ్ పూర్తి

ములుగు: జిల్లాలో 96.24 శాతం ఇళ్లకు స్టిక్కరింగ్ వేసే ప్రక్రియ పూర్తి అయ్యింది. గురువారం సాయంత్రం వరకు తొమ్మిది మండలాల్లోని 88,071ఇళ్లకు గాను 902 బ్లాక్‌లలోని 84,757ఇళ్లకు స్టిక్కరింగ్ వేశారు. ఈ లెక్కన శుక్రవారం వరకు 100శాతంపైగా శాతం నమోదు అయ్యే అవకాశం కనిపిస్తుంది. ఎస్ఎస్ తాడ్వాయి, కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం(కె) మండలాల్లో ఇప్పటికే అనుకున్న వాటికంటే ఎక్కువగా ఇళ్ల సర్వే జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి తప్పిదాలు లేకుండా జిల్లా వ్యాప్తంగా పకడ్బందీగా సర్వే జరుగుతుందని తెలిపారు. మొదటి విడత సర్వేలో భాగంగా చివరి రోజు(శుక్రవారం) ఇంటికి వచ్చే ఎన్యుమరేటర్లకు ప్రజలు సహకరించాలని కోరారు. రేపటి(శనివారం) నుంచి రెండో విడత ఆర్థిక, సామాజిక సర్వే మొదలు కాబోతుందని తెలిపారు.

మండలం	మొత్తం ఇళ్లు	స్టిక్కరింగ్ వేసిన ఇళ్లు	పూర్తి అయిన శాతం
ములుగు	19,827	18,729	94.46
వెంకటాపురం(ఎం)	10,422	8,295	79.59
గోవిందరావుపేట	9,426	9,195	97.55
ఎస్ఎస్ తాడ్వాయి	6,380	7,381	115.69
ఏటూరునాగారం	8,611	7,130	82.80
కన్నాయిగూడెం	3,361	3,498	104.08
వాజేడు	7,373	7,716	104.65
వెంకటాపురం(కె)	8,801	9,428	107.12
మంగపేట	13,870	13,385	96.50

మోడికుంట ప్రాజెక్టు పనులు చేపట్టాలి

వాజేడు: సాగు, తాగునీరు అందించే మోడికుంట ప్రాజెక్టు పనులను చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవికుమార్ అన్నారు. మండల పరిధిలోని గుమ్మడి దొడ్డిలో సీపీఎం 9వ మండల మహాసభను గురువారం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలంటే సాగునీరు కీలకమన్నారు. అందులో మోడికుంట ప్రాజెక్టు నిర్మాణం ముఖ్యమైందని తెలిపారు. ఈ ప్రాజెక్టు గతంలో మంజూరైనప్పటికీ నిర్మాణ పనులు చేపట్టకపోవడం దురదృష్ట కరమన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి కావాల్సిన అన్ని అనుమతులు వచ్చినప్పటికీ నిధులను మజూరు చేయకపోవడం దారుణమన్నారు. మండల పరిధిలో 25 కిలోమీటర్ల మేర గోదావరి ప్రవహిస్తున్నప్పటికీ సాగునీరు అందని పరిస్థితులు ఉన్నాయన్నారు. అంతకు ముందు పార్టీ జెండాను ఆవిష్కరించి నినాదాలు చేశారు. ఈ మహాసభలో పార్టీ జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, నాయకులు సాంబశివ, దావూద్, ఆగిరెడ్డి, కొప్పుల రఘుపతి, జెజ్జరి దామోదర్, బచ్చలి కృష్ణబాబు, సౌమ్య, గుగ్గిళ్ల దేవయ్య, నాగేశ్వరరావు, పవన్, కుమారి, భూలక్ష్మి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవికుమార్

'బాలలను పనిలో పెట్టుకోవడం నేరం'

ములుగు రూరల్: బాలలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్ అన్నారు. ఈ మేరకు గురువారం మండల పరిధిలోని జాకారం పరిధిలో గల లక్ష్మీగణపతి కాటన్ ఇండస్ట్రీలో బాల కార్మిక నిర్మూలన చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలను ప్రమాదకరమైన పనుల్లో చేర్చుకోవద్దన్నారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని సూచించారు. వలస కార్మికులు కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ స్వామిదాస్, రాచర్ల రాజ్‌కుమార్, కార్మికులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభ్యున్నతికి కృషి

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్

మంగపేట: గ్రంథాలయాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి వాటి అభ్యున్నతికి పాటు పడుతానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలోని గ్రంథాలయాన్ని గురువారం ఆయన సందర్శించి మాట్లాడారు. గ్రంథాలయానికి వచ్చే పాఠకులకు తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. అదే విధంగా విరామ సమయంలో టీ కూడా ఇవ్వాలని సూచించారు. గ్రంథాలయానికి నిత్యం పాఠకులు వచ్చేలా చూడాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. కళాశాలలోని గ్రంథాలయంలో సుమారుగా 6000 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ఉపయోగపడే పుస్తకాలతో పాటు మహనీయులు చరిత్రలకు సంబంధించిన అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అదే విధంగా కళాశాలలో నెలకొన్న సమస్యలను మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. మొదటి సారిగా కళాశాలకు వచ్చిన చైర్మన్‌ను అధ్యాపకులు, విద్యార్థులు శాలువాతో సన్మానించారు. అనంతరం రైతువేదిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను 25మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు.



కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న రవిచందర్

సద్వినియోగం చేసుకోవాలి
భూపాలపల్లి అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా నేర్పిస్తున్న కరాటే శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ మాస్టర్, ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటే శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని కమలాపూర్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం మాస్టర్ శ్రీనివాస్ కరాటే శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాస్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. జిల్లాలో అనుభవం కలిగిన మాస్టర్‌లతో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.

వరికోతల సమయంలో జాగ్రత్తలు పాటించాలి

కలెక్టర్ టీఎస్.దివాకర

ములుగు: హార్వెస్టర్‌తో వరికోతలు చేపట్టే సమయంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకుంటే తాలు లేకుండా ధాన్యం వస్తుందని కలెక్టర్ టీఎస్.దివాకర సూచించారు. ఈ మేరకు ఎస్పీ డాక్టర్ శబరీశ్, అదనపు కలెక్టర్(రెవెన్యూ) సీహెచ్.మహేందర్‌జీతో కలిసి గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల వ్యవసాయ అధికారులు, హార్వెస్టర్ యజమానులతో మండల స్థాయి సమావేశాలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించాలని తహసీల్దార్లను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్ల తీరు, ఫిర్యాదుల కోసం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ పనివిధానం, గన్ని సంచులు, టార్పాలిన్ కవర్లు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యారోగ్యశాఖ పట్ల ప్రజల్లో నమ్మకం పెరిగినప్పుడే ఎక్కువ మంది ప్రభుత్వ ఆస్పత్రులకు వస్తారని తెలిపారు. అత్యవసర వైద్యం కోసం పరికరాలు అవసరమైతే వాటిని కొనుగోలు చేయాలని సూచించారు. అనంతరం జనవరి ఒకటవ తేదీ 2025 వరకు 18సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టీఎస్ దివాకర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 29వ తేదీన జారీ అయిన ముసాయిదా ఓటరు జాబితా ఆక్షేపణలు, అభ్యంతరాలు తీసుకోవడానికి ఈ నెల 9, 10వ తేదీలలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. బీఎల్ఓలు పోలింగ్‌బూత్ కేంద్రాల వద్ద ఉదయం 10గంటల నుంచి అందుబాటులో ఉంటారని వివరించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర పక్కన ఎస్పీ శబరీశ్ తదితరులు

కలెక్టర్ పేరుతో ఫేక్ మెస్సేజ్‌లు

జిల్లా కలెక్టర్ దివాకర పేరుతో సైబర్ నేరగాళ్లు ఫేస్‌బుక్ నకిలీ ఖాతా సృష్టించారు. ఖాతాను ఉపయోగించి పలువురి నుంచి డబ్బులు వసూళ్లు చేసేందుకు నేరగాళ్లు యత్నిస్తున్నట్లు కలెక్టర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐడీ ద్వారా సోషల్‌మీడియా యాక్టీవ్‌గా ఉండే వారి ఖాతాలకు ఫ్రెండ్ రిక్వెస్టులు పంపిస్తున్నారని వివరించారు. యాక్సెప్ట్ చేసిన అనంతరం మెస్సేంజర్‌లో మెసేజ్‌లు పలువురికి పంపిస్తున్నారని తెలిపారు. ఇది గమనించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. వెంటనే అకౌంట్ ద్వారా అందరిని అప్రమత్తం చేశానని వెల్లడించారు. తన పేరుతో ఎవరు డబ్బులు అడిగినా ఇవ్వొద్దని సూచించారు. వీలైనంత వరకు తన ఐడీని బ్లాక్ చేయాలని కోరారు. కాగా, మూడు నెలల కాలంలో కలెక్టర్ అకౌంట్ రెండు సార్లు హ్యాక్ అయ్యింది. దీంతో పోలీసులు సైబర్ కేటుగాళ్ల ఆటకట్టించేందుకు సిద్ధమయ్యారు.

భద్రకాళి చెరువుకు పునరుజ్జీవం

చెరువు శుద్ధి, పూడికతీత పనులకు శ్రీకారం

నేటినుంచి నాగారం చెరువులోకి నీటి తరలింపు
- ప్రతీరోజు 500 క్యూసెక్కులు
- చెరువును సందర్శించిన కలెక్టర్, కమిషనర్

హన్మకొండ కల్చరల్/హసన్‌పర్తి :

చారిత్రక నేపథ్యమున్న నగరంలోని భద్రకాళి చెరువు పునరుజ్జీవానికి వేగంగా అడుగులు పడుతున్నాయి. భద్రకాళి ఆలయ ఆధునికీకరణ నేపథ్యంలో చెరువు సుందరీకరణ దిశగా చర్యలు ముమ్మరం చేశారు. ఈ మేరకు గత మంగళవారం హైదరాబాద్‌లో జిల్లామంత్రులు, గ్రేటర్ ప్రజాప్రతినిధులు, ఇరు జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర రెవెన్యూ శాఖ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేకంగా సమావేశమై భద్రకాళి ఆలయం, చెరువు ఆధునికీకరణ, పరిరక్షణకు దిశానిర్దేశం చేశారు. దీంతో అధికా రులు కార్యాచరణ రూపొందించి పనులు మొదలుపెట్టారు. శుక్రవారంనుంచి చెరువు నీటిని హసన్‌పర్తి మండలం నాగారం జలాశయంలోకి తరలించనున్నారు. ప్రతీరోజూ 500 క్యూసెక్కుల నీటిని తరలించేందుకు నిర్ణయించారు.

కాకతీయుల కాలంనాటి గొలుసుకట్టు చెరువు..


వరంగల్, హనుమకొండ నడుమ పశ్చిమ, దక్షిణ దిక్కులుగా వ్యాపించి ఉన్న ఈ గొలుసుకట్టు చెరువును కాకతీయరాజుల కాలంలో క్రీ.శ 10వ శతాబ్దంలో మీసరగండడు అనే మంత్రి కట్టించాడు. భద్రకాళి గుట్టల మధ్య అతిపురాతనమైన భద్రకాళి దేవాలయం ఉంది. ఈ ఆలయం పేరుతోనే భద్రకాళి చెరువు ఏర్పడింది. గొలుసుకట్టు చెరువులైన బొస్తం చెరువు, అగర్తలు, మంగళమ్మకుంట, రంగసముద్రం, కాశికుంట, సాకరాశికుంట తదితర చెరువులు, కుంటలు మత్తడి పోస్తే ఆ వరద భద్రకాళి చెరువులోకి చేరుకునేది. నాడు సాగు, తాగునీటికి ఈ చెరువును వినియోగించేవారు. 1960లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏడేళ్ల కరువు వచ్చినపుడు ఈ చెరువు కూడా ఎండిపోయింది. ఇందులో బావి తవ్వడంతో నీరు పడింది. ఆ నీళ్లతోనే వరంగల్ వాసులు దాహార్తిని తీర్చుకున్నారని చెబుతున్నారు.

వేసవి జలాశయం

1984–85లో ఈ చెరువును తాగునీటి వేసవి జలాశయంగా ప్రకటించారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టునుంచి కెనాల్ ద్వారా వచ్చే నీళ్లను భద్రకాళి చెరువులోకి పంపింగ్ చేసేవారు. 1994 వరకు రైతులు సాగునీరుకు ఉపయోగించగా.. 2000 సంవత్సరం వరకు నగర ప్రజలు తాగునీటి అవసరాలకు వినియోగించారు. ఈ జలాశయం వరంగల్, హనుమకొండ, కాజీపేట పురవాసులకు మంచినీటిని అందజేసింది. 4.05కోట్ల రూపాయలతో జలాశయాన్ని అభివృద్ధి చేశారు. ఈ సమయంలో సుమారు 2 లక్షలకు పైగా జనాభాకు దాహం తీర్చింది. చెరువు పూర్తిగా చెత్తాచెదారంతో నిండిపోవడంతో తాగునీటి సరఫరాను నిలిపివేశారు.

మాడవీధుల నిర్మాణం కోసం 50 అడుగులు ముందుకు..

భద్రకాళి దేవాలయం చుట్టూ మాడవీధుల నిర్మాణంలో భాగంగా చెరువును 50 అడుగులు ముందుకు జరపనున్నారు. చెరువులో 4, 5 అడుగుల లోతు మేరకు పూడికతీతకు నిర్ణయించారు. ఈ మేరకు చెరువు ఎలా ఖాళీ చేయాలి.. పూడికతీత పనులు ఎలా చేపట్టాలన్న దానిపై అధికారులు కసరత్తు చేశారు.



చెరువుల సామర్థ్యం

భద్రకాళి	నాగారం
0.1టీఎంసీ	0.1టీఎంసీ

నీటి తరలింపు ఇలా..
భద్రకాళి చెరువు నీటిని హసన్‌పర్తి మండలం నాగారం జలాశయంలోకి తరలింపు ప్రక్రియ శుక్రవారంనుంచి ప్రారంభించనున్నారు. ఇప్పటికే ఉన్న కాల్వ ద్వారా ప్రతీరోజూ 500 క్యూసెక్కుల నీటిని తరలిస్తారు. క్రమంగా నీటి విడుదలను పెంచనున్నారు. భద్రకాళి సామర్థ్యం 0.1టీఎంసీ, నాగారం చెరువు కెపాసిటీ 0.1 టీఎంసీ కాగా, ఈ చెరువు ద్వారా 17 గ్రామాలకు సాగునీరు అందుతుంది. నగరం నుంచి వచ్చే మురికి నీరు ఈ చెరువులో చేరుతుంది. వెనువెంటనే చెరువునుంచి దిగువకు విడుదల చేయనున్నారు. భద్రకాళి చెరువు నీటిని అదనంగా తరలించే క్రమంలో పంట పొలాలు ముంపునకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని స్థానిక రైతులు హనుమకొండ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పంటపొలాలు ముంపునకు గురికాకుండా నీరు కాల్వల ద్వారా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆమె ఆదేశించారు.

521 ఎకరాల్లో సువిశాలమైన చెరువు
భద్రకాళి చెరువు హనుమకొండ రెవెన్యూ శివారులో.. సుమారు 521 ఎకరాల్లో (రెవెన్యూ రికార్డుల ప్రకారం) విస్తరించి ఉంది. సర్వే నంబర్ల ప్రకారం 849/బీలో 386.33 ఎకరాలు, 848/ఏ1,748/1, 749/2,749/3,750/1,750/2,750/3,756/2, 849/బీ2లో మిగతా భూమి ఉంది. ప్రైవేట్ పట్టా భూములు పుట్టుకొచ్చాయని, 11 ఏళ్ల క్రితమే ఎఫ్‌టీఎల్ హద్దులు ఏర్పాటు చేశారు. కానీ చాలా మేరకు ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు.

నాగారం చెరువు పరిశీలన..



చెరువు వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య, కమిషనర్ వాకడే

భద్రకాళి నీటిని తరలించే నాగారం చెరువును గురువారం హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, నగర కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పరిశీలించారు. చెరువు నీటి నిల్వ సామర్థ్యాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం నుంచి భద్రకాళి చెరు వు నుంచి కాల్వ ద్వారా నీటిని నాగారం చెరువులోకి తరలిస్తున్నట్లు కలెక్టర్ తెలిపా రు. చెరువు కింది రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామ్ నర్సింహారెడ్డి, తహసీల్దార్ ప్రసాద్, నీటిపారుదలశాఖ ఈఈ సీతారాం, ఎంపీడీఓ ప్రవీణ్, డీఈఈ రాజు, కిశోర్, కర్ణాకర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నకిలీ విత్తనాలతో నష్టం

- దిగుబడి రాకపోవడంతో ఆందోళన
- దుకాణం ఎదుట రైతుల నిరసన



పరకాల : ఎకరానికి 45 బస్తాల దిగుబడి వస్తుందని పరకాలకు చెందిన కళ్యాణి ట్రేడర్స్ యజమాని విక్రయించిన విత్తనాలు నకిలీవని దుకాణం ఎదుట రైతులు గురువారం ఆందోళన నిర్వహించారు. వ్యాపారి మాటలు నమ్మి 70 ఎకరాల్లో శ్రీ సత్య సీడ్‌ను సాగు చేయగా పంట దిగుబడి లేక నష్టపోయామని శాయంపేట మండలం పత్తిపాక గ్రామానికి చెందిన రైతులు దుకాణం ఎదుట వరి గొలుసులతో ఆందోళనకు దిగారు. సంబంధిత వ్యాపారిపై చర్య తీసుకొని నష్టపోయిన రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలని బాధితులు డిమాండ్ చేశారు. అయితే 150 ఎకరాలకు శ్రీసత్య సీడ్‌ను విక్రయించగా కేవలం ఒకే గ్రామానికి చెందిన 20 ఎకరాలకు సంబంధించిన రైతులకు మాత్రమే దిగుబడి తక్కువగా వచ్చినట్లు తనకు ఫిర్యాదు వచ్చినట్లు తెలిపారు. వాతావరణంతో పాటు పంటసాగులో రైతులు అనుసరించే విధానంతో దిగుబడిలో తేడా వస్తుందని వ్యాపారి పాపిరెడ్డి పేర్కొన్నారు.

చిరువ్యాపారి ఆత్మహత్య

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ విష్ణుపురి ఎస్సీ కాలనీకి చెందిన చిరువ్యాపారి కడారి రాజు (40) గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. రాజుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రాజు ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు చెబుతున్నారు.

బాలిక మృతిపై మెడికల్ కౌన్సిల్ విచారణ

- ఆర్‌ఎంపీపై ఫిర్యాదు



హరిపిరాలలో ఆర్‌ఎంపీ ఇంటివద్ద విచారణ చేస్తున్న అధికారులు

తొర్రూరు రూరల్: మానుకోట జిల్లా తొర్రూరు మండలంలోని హరిపిరాల గ్రామానికి చెందిన ఓ ఆర్‌ఎంపీ చికిత్స వికటించి ఇటీవల గిరిజన బాలిక బానోతు ఐశ్వర్య మృతి చెందిన ఘటనను సుమోటాగా స్వీకరించిన తెలంగాణ మెడికల్ కౌన్సిల్ గురువారం విచారణ చేపట్టింది. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలంలోని ఏనుకుంట తండాకు చెందిన బానోతు ఐశ్వర్య జ్వరంతో బాధపడుతుండగా.. తొర్రూరు మండలంలోని హరిపిరాల గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ చెన్న సారయ్య వద్దకు తీసుకొచ్చి చికిత్స చేయించారు. పరిస్థితి విషమించడంతో తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించేలోగా బాలిక మృతి చెందింది. దీంతో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ అధికారులు డాక్టర్ శేషుమాధవ్, డాక్టర్ నరేశ్‌కుమార్, డాక్టర్ అన్వర్‌మియా, డాక్టర్ శిరీష, డాక్టర్ రితేశ్‌లతో కూడిన బృందం ఆర్‌ఎంపీ ఇంటికి వెళ్లి విచారణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్‌ఎంపీగా చలామణి అవుతున్న సారయ్యకు ఎలాంటి అర్హతలు లేవని, కనీసం పదో తరగతి కూడా పాస్ కాలేదని ఇలాంటి వ్యక్తి చికిత్సలు చేస్తూ, మందులు పంపిణీ చేస్తూ అమాయక ప్రజల ప్రాణాలతో చలగాటం ఆడుతున్నాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్



లక్ష్మీపురం మార్కెట్‌లోని కమీషన్ మడిగెల ఎదుట రిటైల్ వ్యాపారం



జులై 26న లక్ష్మీపురం మార్కెట్‌ను సందర్శించిన కలెక్టర్ సత్యశారద(ఫైల్)

కమీషన్ పేరుతో రిటైల్ వ్యాపారం

- వరంగల్ లక్ష్మీపురం మార్కెట్‌లో వ్యాపారుల ఇష్టారాజ్యం
- మడిగెల ఎదుట ఆక్రమణలు.. అందులోనే విక్రయాలు
- వ్యాపారులు, హమాలీలకు గుర్తింపు కార్డుల జారీలో జాప్యం
- చోద్యం చూస్తున్న మార్కెటింగ్ శాఖ అధికారులు

వరంగల్: వరంగల్ లక్ష్మీపురం మోడల్ కూరగాయల మార్కెట్‌లో కమీషన్ లైసెన్సులు పొందిన వ్యాపారులు కూరగాయలు కింద పోసి రిటైల్ వ్యాపారం చేయొద్దని జిల్లా కలెక్టర్ సత్యశారద చేసిన హెచ్చరికలను అధికారులు, వ్యాపారులు బేఖాతర్ చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. లక్ష్మీపురంలోని కూరగాయల మార్కెట్‌ను జూలై 26వ తేదీన కలెక్టర్ సత్యశారద సందర్శించారు. ఈసందర్భంగా కమీషన్ లైసెన్సులు గల షాపుల ఎదుట కూరగాయల రిటైల్ అమ్మకాలను చూసిన కలెక్టర్.. కమీషన్ వ్యాపారులు కూరగాయలు కింద పోసి రిటైల్‌గా ఎలా అమ్ముతారని, బస్తాల లెక్కన అమ్మాలి కదా అని అక్కడే ఉన్న వ్యాపారులను ప్రశ్నించారు. వ్యాపారుల నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో ఈవిషయంపై వివరణ ఇవ్వాలని అప్పటి డీఎంఓ ప్రసాద్‌రావును ఆదేశించారు. అనంతరం అధికారులతో జరిగిన సమావేశంలో మార్కెట్‌లోని వ్యాపారులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని, హమాలీలకు డ్రెస్‌కోడ్ వర్తింపజేయడంతోపాటు ప్రతి ఒక్కరూ ఐడీ కార్డులు ధరించి ఉండేలా చర్యలు తీసుకోవాలని మార్కెట్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్.. మార్కెట్‌ను సందర్శించి ఆదేశాలు జారీ చేసి 3 నెలలు దాటినా.. కమీషన్ వ్యాపారుల తీరు మారలేదు.. హమాలీలకు ఐడీ కార్డులు జారీ చేయలేదు. ఈవిషయంపై మార్కెట్ అధికారులు అలసత్వం వహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

గుర్తింపు కార్డులతో కొందరికి ముప్పే..!


లక్ష్మీపురం మార్కెట్‌లో కమీషన్ వ్యాపారులు, హమాలీలు, రిటైల్ వ్యాపారులకు గుర్తింపు కార్డులు జారీ చేస్తే అసలు విషయం బట్టబయలు అవుతుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కమీషన్ వ్యాపారులుగా మడిగెలను పొందిన కొందరు వారి షాపుల ఎదుటే అద్దెలకు ఇచ్చిన విషయం గుర్తింపు కార్డులతో బహిర్గతం అయ్యే అవకాశాలు ఉన్నాయి. కొంత మంది ఇక్కడ కమీషన్ షాపులు పొంది కవర్ షెడ్డుతోపాటు ఓపెన్ ప్లాట్లు పొందిన విషయం సైతం బయట పడే అవకాశాలు ఉన్నాయి. అందువల్లే మార్కెటింగ్ అధికారులు గుర్తింపు కార్డుల జారీలో జాప్యం చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. అదేవిధంగా బినామీ పేర్లతో కవర్ షెడ్డులో, ఓపెన్‌గా ప్లాట్లు గతంలో అధికారంలో ఉన్న నాయకులు, ప్రస్తుతం అధికార పార్టీలో ఉన్న నేతల పేర్లు సైతం బయటపడతాయని సమాచారం. మాజీ ఎమ్మెల్యే అండతో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ పేర కేటాయింపులు, మార్కెట్ నాయకులుగా కొనసాగుతున్న వారు వారి బంధువుల పేర్లతో పొందిన ప్లాట్ల విషయం బయటకు పొక్కుతుందనే ఉద్దేశంతోనే గుర్తింపు కార్డులు జారీ కాకుండా పలువురు అడ్డుకుంటున్నట్లు సమాచారం.

అద్దెలతోనే అసలు లాభం..

మార్కెట్‌లో కమీషన్ మడిగెలు పొందిన వారిలో మెజార్టీ వ్యాపారులు వ్యాపారం కంటే వారి ఎదుట ఉన్న స్థలాలను రిటైల్ వ్యాపారులకు రోజువారీ, ఏడాది వారీగా అద్దెలకు ఇచ్చి ఆదాయం పొందుతున్నట్లు తెలుస్తోంది. రోజు వారీగా రూ.500, ఏడాదికి రూ.1.50లక్షల నుంచి రూ.2లక్షల వరకు అద్దెలకు ఇచ్చినట్లుగా తెలుస్తోంది. కమీషన్ పేరుతో మడిగెలు పొందిన వ్యాపారులు మార్కెట్ కమిటీకి సైజుల వారీగా రూ.2,700 నుంచి రూ.4,500 నెలవారీగా అద్దెలు కట్టాల్సి ఉంది. మడిగెల ఎదుట స్థలాలను అద్దెలకు ఇచ్చి నెల వారీగా వేల రూపాయలు పొందుతున్నప్పటికీ కమీషన్ వ్యాపారులు దాదాపు 8నెలలుగా అద్దె బకాయిలు ఉండడం గమనార్హం. వరంగల్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌పై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తే ప్రభుత్వ ఖజానాకు భారీగా ఆదాయం సమకూరుతుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

తుదిదశకు డీఎస్సీ 2008 నియామక ప్రక్రియ

- ఇప్పటికే సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి
- విద్యాశాఖ డైరెక్టర్‌కు.. నేడు అభ్యర్థుల వివరాలు



విద్యారణ్యపురి: డీఎస్సీ 2008 అభ్యర్థుల నియామక ప్రక్రియ చివరిదశకు చేరుకుంది. బీఈడీ అభ్యర్థులకు 70శాతం, డీఈడీ అభ్యర్థులకు 30శాతం ఎస్‌జీటీ పోస్టులు కేటాయించడంతో డీఎస్సీ 2008లో సెలెక్ట్ అయినప్పటికీ ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొందరికి ఉద్యోగాలు రాలేదు. దీంతో అప్పట్లో ఉద్యోగం రాని అభ్యర్థులను కాంట్రాక్టు ప్రాతిపదికన టీచర్లుగా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్ణయించిన విషయం విధితమే. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించి అప్పట్లో సెలక్టెడ్ లిస్టులో ఉన్న అభ్యర్థులకు సమాచారం ఇచ్చి హనుమకొండ డీఈఓ కార్యాలయంలో డీఈఓ వాసంతి పర్యవేక్షణలో అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేశారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ నుంచి వచ్చిన ప్రొఫార్మా ప్రకారం ఆయా అభ్యర్థుల వివరాలను పొందుపర్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మైదాన ప్రాంతంలో మొత్తంగా 274 మంది అభ్యర్థులు ఉండగా అందులో 175 మంది అభ్యర్థులు హనుమకొండ డీఈఓ కార్యాలయానికి హాజరై తమ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో అప్పట్లో 56 మంది సెలెక్ట్ అయిన జాబితాలో ఉండగా అందులో 15 మంది అభ్యర్థులు మాత్రమే సర్టిఫికెట్లు వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. మొత్తంగా 190మంది అభ్యర్థులకు సంబంధించి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తికాగా అందులోనుంచి పలువురుని అనర్హులుగా గుర్తించినట్లు సమాచారం. చివరిదశలో ఇక ఆయా అభ్యర్థులు సమర్పించిన సర్టిఫికెట్లు తదితర అంశాల పరిశీలన ప్రక్రియ డీఈఓ కార్యాలయంలో చివరిదశకు చేరుకుంది. ఈ అభ్యర్థులకు సంబంధించిన సర్టిఫికెట్ల పరిశీలనపై పర్యవేక్షణకు వయోజన విద్య శాఖ అడిషనల్ డైరెక్టర్ ఉషారాణిని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నియమించారు. ఈనెల 8న హనుమకొండ డీఈఓ కార్యాలయానికి ఉషారాణి రానున్నారని సమాచారం. ఇక ఆ 190 మంది అభ్యర్థులలో అర్హులైనవారిందరి జాబితాను రూపొందించి విద్యాశాఖ డైరెక్టరేట్ పంపిన ఓ ప్రొఫార్మాలో ఆయా డీఎస్సీ అభ్యర్థుల వివరాలను ఈనెల 8లోగా పంపించనున్నట్లు తెలిసింది. ఈ విషయంపై హనుమకొండ డీఈఓ వాసంతి ధ్రువీకరించారు. ఈజాబితా పంపిన అనంతరం అభ్యర్థులను ప్రభుత్వం కాంట్రాక్టు పద్ధతిపై టీచర్లుగా నియమించే అవకాశం ఉంది.

రాయచూర్‌లో మాంగళ్య షాపింగ్ మాల్ ప్రారంభం



మాంగళ్య షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో కన్నడ హీరోయిన్లు ఆశిక రంగనాథ్, మంజుశెట్టి

కాజీపేట అర్బన్ : కర్ణాటకలోని రాయచూర్‌లో మాంగళ్యషాపింగ్ మాల్‌ను గురువారం స్థానిక ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్.. కన్నడ హీరోయిన్లు ఆశిక రంగనాథ్, మంజుశెట్టితో కలిసి ప్రారంభించారు. తెలంగాణలో 2012లో ప్రారంభించిన మాంగళ్య షాపింగ్ మాల్స్ ఇప్పుడు 23వ స్టోర్‌ను కర్ణాటకలోని రాయచూర్‌లో ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందని షాపింగ్ మాల్ డైరెక్టర్లు పుల్లూరు నర్సింహామూర్తి, కాసం నమశ్శివాయ, కాసం మల్లికార్జున్, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్, పుల్లూరు అరుణ్‌కుమార్ తెలిపారు. నాణ్యమైన వస్త్రాలను అతి తక్కువ ధరలకే అన్ని వయస్సుల వారికి అందజేయడం తమ విజయ రహస్యమని తెలిపారు.

ఎస్సార్‌లో ముగిసిన ఇన్నోవిజన్



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

హసన్‌పర్తి: ఎస్సార్ యూనివర్సిటీ ప్రాంగణంలోని సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఇన్నోవిజన్–2024 గురువారం ముగిసింది. ఈసందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పెయింటింగ్‌తోపాటు షార్ట్ ఫిలిం ప్రదర్శించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీ రెడ్డి, అధ్యాపకులు డాక్టర్ మహేందర్, డాక్టర్ సుదర్శన్, డాక్టర్ శ్రీవాణి, ఏఓ వేణుగోపాలస్వామి, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి మేడపై గంజాయి పెంపకం

- నిందితుడి అరెస్ట్
- మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగింత



మేడపై పూలతొట్లల్లోని గంజాయి మొక్కలను పరిశీలిస్తున్న పోలీసులు

ఖిలా వరంగల్: సులభంగా డబ్బులు సంపాదించాలనే దురాశతో ఇంటిమేడపై పూలతొట్లలో గంజాయి మొక్కలు పెంచుతున్న వ్యక్తిని యాంటీడ్రగ్స్ టీమ్ పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన గురువారం వరంగల్ శివనగర్‌లో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ శివనగర్ ప్రాంతానికి చెందిన పల్లెబోయిన కుమార్ తన ఇంటిపై ఏర్పాటు చేసిన పూలతొట్లల్లో గంజాయి మొక్కల పెంపకం చేపట్టాడు. వరంగల్ రైల్వేస్టేషన్‌లో తనిఖీల్లో ఉన్న యాంటీ డ్రగ్స్ టీం పోలీసులకు గంజాయి పెంపకంపై పక్కా సమాచారం అందింది. ఈమేరకు గురువారం మధ్యాహ్నం శివనగర్‌లోని గంజాయి మొక్కలు పెంచుతున్న ఇంటిపై ఆకస్మికంగా దాడి చేశారు. మత్తు పదార్థాలను పసిగట్టే పోలీస్ జాగిలంతో మేడ పైన తనిఖీ చేశారు. గంజాయి మొక్కలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు కుమార్‌ను అరెస్ట్ చేసి మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించినట్లు యాంటీ డ్రగ్స్ టీమ్ ఇన్‌చార్జ్ ఆర్‌ఐ శివకేశవులు వెల్లడించారు.

గంజాయితో ముగ్గురు వ్యక్తులు

చిల్పూరు: ముంబయికి చెందిన ముగ్గురు వ్యక్తులు జనగామ జిల్లా చిల్పూరు మండలంలోని వంగాలపల్లి గేట్ వద్ద గంజాయితో గురువారం పట్టుబడినట్లు జనగామ రూరల్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం.. ముంబయికి చెందిన కృష్ణ గోపి, శారద గోపి, అనుష్క నితిన్ కాంబ్లే.. విశాఖపట్నంలో 19 కిలోల గంజాయి కొనుగోలు చేసుకుని ముంబయికి తిరుగు ప్రయాణమయ్యారు. ఈక్రమంలో రైలు కాజీపేటకు చేరుకున్నాక రైల్వే పోలీసులు తనిఖీలు చేస్తుండడంతో రైలు దిగి పట్టాల వెంట నడుచుకుంటూ వంగాలపల్లి రైల్వే గేట్ వరకు వచ్చి అక్కడ ఆగిపోయారు. గంజాయి తరలిస్తున్నట్లు పక్కా సమాచారం మేరకు దాడి చేసి వారి నుంచి 19 కిలోల ఎండు గంజాయి, రూ.4.75 లక్షల నగదు, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

బతుకుదెరువు కోసం వచ్చి..

- భవనంపై నుంచి పడి కూలీ దుర్మరణం



జానకీరామ్(ఫైల్)



గాయపడిన జానకీరావు

మహబూబాబాద్ రూరల్ : బతుకుదెరువు కోసం వచ్చి సుతారి కూలీగా పని చేస్తూ ఓ కార్మికుడు భవనం పైనుంచి జారిపడి మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రంలోని గజపతి జిల్లా ఒంద్రాడ గ్రామానికి చెందిన లింగాల జానకీరామ్ (37), తన భార్య గౌరీ, ఇతర కూలీలతో కలిసి కొంత కాలం క్రితం కూలి పనుల కోసం మహబూబాబాద్‌కు వచ్చారు. జిల్లా కేంద్రంలోని ఏకశిల హైస్కూల్ సమీపంలో నిర్మిస్తున్న ఓ బహుళ అంతస్తుల భవనంలో జానకీరామ్ పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం భవనానికి గోవా కర్రలు, కొత్త తడకలను కడుతుండగా.. సమీప గ్రామం గండవాతికి చెందిన దయ్యాలు జానకీరావు, జానకీరామ్ తోపాటు ప్రమాదవశాత్తు భవనం ఐదో అంతస్తు నుంచి కింద పడిపోయారు. గమనించిన స్థానికులు, తోటి కూలీలు వెంటనే వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. జానకీరామ్‌ను పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. జానకీరావుకు తీవ్రగాయాలు కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించాలని వైద్యులు సూచించారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి అవుట్ పోస్టు హెడ్ కానిస్టేబుల్ గోపి ప్రమాద వివరాలను టౌన్ సీఐ దేవేందర్‌కు తెలియజేయడంతో ఆయన ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబసభ్యులు సంఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కేంద్రం పత్తి దిగుమతిని నిలిపివేయాలి

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



జిన్నింగ్ మిల్లును ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

కాటారం: విదేశాల నుంచి పత్తి దిగుమతులను కేంద్రం నిలిపివేసి రాష్ట్రంలో రైతులు పండిస్తున్న పత్తికి గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. కాటారం మండలం ధన్వాడ సమీపంలోని మీనాక్షి కాటన్ ఆగ్రోటెక్ ఇండస్ట్రీస్, సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని గురువారం శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ ప్రాంతంలోని పత్తి రైతులకు మద్దతు ధర కల్పించి సక్రమంగా కొనుగోళ్లు చేపట్టాలని జిన్నింగ్ మిల్లు నిర్వాహకులు, సీసీఐ అధికారులకు మంత్రి సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశంలో అధిక సంఖ్యలో రైతులు పత్తి పంట సాగు చేయడంతో పత్తి నిల్వలు పేరుకుపోయాయని అన్నారు. సీసీఐ ద్వారా పత్తికి మద్దతు ధర రూ.7,520 కల్పించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. మంత్రి వెంట కలెక్టర్ రాహుల్‌శర్మ, సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, మార్కెటింగ్ డీఎం కనకశేఖర్, ఏఎస్పీ బోనాల కిషన్, ఏఎంసీ కార్యదర్శి లాషరీఫ్, తహసీల్దార్ నాగరాజు, నయాబ్ తహసీల్దార్ రామ్మోహన్, మిల్లు నిర్వాహకులు ముక్క శివకుమార్, తదితరులు ఉన్నారు.

సమస్య పరిష్కారానికి కృషి..

రెడ్డిగాండ్ల సామాజిక వర్గాన్ని బలహీన వర్గాల జాబితాలో చేర్చే అంశాన్ని న్యాయపరంగా పరిష్కరించడానికి కృషి చేస్తానని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. కాటారం మండల కేంద్రంలో రెడ్డిగాండ్ల సంఘం ఆధ్వర్యంలో ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన అయిత ప్రకాశ్‌రెడ్డి ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంతకముందు కాటారం శ్రీపాదకాలనీలో ఏర్పాటు చేసిన కమాన్‌ను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ప్రకాశ్‌రెడ్డి, ఉప్పల్ కార్పొరేటర్ కిరణ్‌రెడ్డి, నిర్వహణ కమిటీ కన్వీనర్ వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, చల్ల జక్కిరెడ్డి పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఇసుక లారీ

- ఒకరి మృతి



నాగేశ్వర్‌రావు మృతదేహం

మంగపేట : ములుగు జిల్లా మంగపేట మండల కేంద్రంలోని గౌరారం వాగు బ్రిడ్జి సమీపంలో ఏటూరునాగారం– బూర్గంపాడు ప్రధాన రోడ్డుపై ఇసుక లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందాడు. గురువారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏటూరునాగారం మండలం కంతనపల్లి గ్రామానికి చెందిన కంపెల్ల నాగేశ్వర్ రావు (43) ఏటూరునాగారంలో బంధువుల ఇంటిలో జరిగే శుభకార్యానికి హాజరయ్యాడు. అనంతరం సాయంత్రం 4.30 గంటల సమయంలో ఏటూరునాగారం వైపు నుంచి మల్లూరు వైపు మోటారు సైకిల్‌పై వెళ్తుండగా.. మల్లూరు వైపు నుంచి ఏటూరునాగారం వైపు ఇసుక లోడుతో వస్తున్న లారీ ఢీ కొట్టడంతో తల ఛిద్రమై, కాలు నుజ్జునుజ్జు అయింది. స్పృహతప్పి పడిఉన్న క్షతగాత్రుడిని స్థానికులు 108లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య సరస్వతి, ఇద్దరు కుమారులు వాసు, విష్ణు ఉన్నారు. కాగా, ఏటూరునాగారం ఫంక్షన్ అనంతరం నాగేశ్వర్‌రావు కొత్తమల్లూరు(బెస్తగూడెంలో)ని తన బంధువుల ఇంటికి వెళ్లే క్రమంలో ప్రమాదం జరిగి ఉంటుందని బంధువులు భావిస్తున్నారు.

భారీగా గుట్కాల పట్టివేత



టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్న గుట్కా నిల్వలు

రామన్నపేట: వరంగల్ మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం రూ.2.08 లక్షలు గుట్కాలు పట్టుకున్న మరుసటి రోజే గురువారం రూ.22.43 లక్షల గుట్కా నిల్వలను స్వాధీనం చేసుకుని మట్టెవాడ పోలీసులకు అప్పగించారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం మట్టెవాడ పరిధిలోని పెరుకవాడలో గోదాంలో గొల్ల మల్లికార్జున్ దాసిన గుట్కా నిల్వలపై దాడిచేసి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, పిన్నవారి వీధిలో భూపేందర్ చౌదరి అనే వ్యాపారి వద్ద నుంచి రూ. 2.08 లక్షల విలువ గల గుట్కాలను బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ వివరించారు.

పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

తొర్రూరు రూరల్: పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులన్నిటిని వెంటనే పూర్తి చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. గురువారం తొర్రూరులోని మిషన్ భగీరథ కార్యాలయంలో పాలకుర్తి, మానుకోట, డోర్నకల్ ఎమ్మెల్యేలు మామిడాల యశస్వినిరెడ్డి, జాటోతు రాంచంద్రు నాయక్, డాక్టర్ భూక్యా మురళీనాయక్, ఎంపీలు కడియం కావ్య, పోరిక బలరాంనాయక్‌తో కలిసి మానుకోట, జనగామ జిల్లాల కలెక్టర్లు అద్వైత్‌కుమార్ సింగ్, రిజ్వాన్ బాషాతో పాటు ఇతర ఉన్నత స్థాయి అధికారులతో సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రెండు జిల్లాల్లో అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయించాలన్నారు. గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణాలకు, ఇంటిగ్రేటెడ్ హైస్కూళ్ల మంజూరుకు స్థలాల సేకరణ చేయాలని, త్వరలో నిర్మించనున్న ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. ఆయా నియోజకవర్గాల్లోని రిజర్వాయర్లు, కాల్వలు, చెరువులు, కుంటల తూములు, కట్టలకు మరమ్మతులు ఉంటే వెంటనే పూర్తి చేయాలని కోరారు.

కంది పంటసాగు పరిశీలన

- మచ్చల పురుగు నివారణకు చర్యలు
- కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న



కందిపంటను పరిశీలిస్తున్న రాజన్న, తదితరులు

మామునూరు : కంది, పెసర సాగు లాభదాయకంగా ఉంటుందని సస్యరక్షణ శాస్త్రవేత్త కేవీకే అధిపతి డాక్టర్ రాజన్న అన్నారు. రాష్ట్రంలో సుమారుగా 4.40 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో పప్పు దినుసు పంట సాగు చేస్తున్నారన్నారు. మచ్చల పురుగు నివారణకు సస్య రక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడికి సాధించాలని ఆయన వివరించారు. గురువారం మామునూరు కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాజుతో కలిసి ఆయన పలు గ్రామాల్లో పర్యటించి కంది, పెసర పంటలను పరిశీలించారు. కంది రకాన్ని బట్టి వానాకాలంలో 150–180 రోజులు, యాసంగిలో 130–140 రోజుల పంట కాలం వస్తుందన్నారు. వానాకాలం ఆలస్యంగా విత్తుకున్న పెసర ప్రస్తుతం పూత, కాత దశలో ఉందని, ప్రస్తుత దశలో ఆకు గూడు, మరక మచ్చల పురుగు ఉధృతి ఎక్కువగా గమనించినట్లు వివరించారు. పురుగు అధికంగా గమనిస్తే స్పైనోశాడ్ 0.4 మిల్లీ లేదా ఇమామెక్టిన్‌బెంజోయేట్ 0.4 గ్రాములు లేదా క్లోరంటానిలిప్రోల్ 0.3 గ్రాములు లేదా ఫ్లుబెండిఎమైడ్0.2 మిల్లీలీటర్లు ఒక లీటరు నీటిలో కలిపి పైరుపై పిచికారీ చేయాలన్నారు.

శబరిమలైకి ప్రత్యేక బస్సులు

ప్రత్యేక బస్సు ఛార్జీలు ఇలా..	
రాజధాని ఏసీ	కిలోమీటర్‌కు రూ.77
సూపర్ లగ్జరీ	కిలోమీటర్‌కు రూ.59
డీలక్స్	కిలోమీటర్‌కు రూ.57
ఎక్స్‌ప్రెస్	కిలోమీటర్‌కు రూ.62
వెయిటింగ్ టైమ్ గంటకు రూ.300	

కాజీపేట అర్బన్ : అయ్యప్ప స్వామి భక్తుల సౌకర్యార్థ శబరిమలైకి ప్రత్యేక ఏసీ, నాన్ ఏసీ బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు వరంగల్ రీజినల్ మేనేజర్ విజయభాను గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టీఎస్‌ఆర్టీసీ వరంగల్ రీజియన్ ఆధ్వర్యంలో శబరిమలై బస్సులు ప్రయాణికులు కోరుకున్న ప్రదేశం నుంచి దర్శించుకోవాల్సిన పుణ్యక్షేత్రాల మీదుగా నడుపబడుతాయని, ప్రత్యేక బస్సుల్లో ఒక గురుస్వామితోపాటు వంటచేయడానికి ఇద్దరు, ఇద్దరు మణికంట స్వాములు, ఒక అటెండర్ ఫ్రీగా ప్రయాణించే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా బస్సులు బుక్ చేసిన గురుస్వామికి ఉచిత ప్రయాణం, ఒకటి కంటే ఎక్కువ బస్సులు బుక్ చేసిన గురుస్వామికి రూ.300 కమిషన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. అయ్యప్ప స్వాములు అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.